జన సంక్షేమమే జగనన్న లక్ష్యం

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- పొన్నూరు 27వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

పొన్నూరు(చేబ్రోలు): జన సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య చెప్పారు. పొన్నూరు పట్టణంలోని 27వ వార్డులో సోమవారం పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలతో అక్కాచెల్లెమ్మలు, అవ్వా తాతలకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యల సహకారం మరువలేనిదని ఈ సందర్భంగా పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఒక్కో కుటుంబానికి లక్ష నుంచి అత్యధికంగా రూ.5 లక్షల వరకూ లబ్ధి చేకూరినట్లు వివరించారు. ఎమ్మెల్యే కిలారి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, పేదల సంక్షేమ సర్కారు అని అన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయటంలో దేశంలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రతి పథకం ప్రజల ముంగిళ్లకే వస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పథకాలను సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా పారదర్శకంగా అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లను దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. అనంతరం స్థానికుల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ సైపుల్లా, ఘోర, పఠాన్, జమాల్ స్థానిక పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



పొన్నూరు పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య

క్లుప్తంగా

అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



కాకుమాను: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్ చెప్పారు. కాకుమాను అంబేడ్కర్ యూత్ సభ్యులకు సోమవారం ఆయన అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ మేధావి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో మెరిగల రవిబాబు, గేరా పున్నారావు, మన్నవ ప్రకాష్, పెదపూడి కపిల్, మెరిగల సుందరరావు, పొందుగుల ఆచారి, కంకణాల ఆనోకు, అంబేడ్కర్ యూత్ సభ్యులు ఉన్నారు.

అందరూ హెల్మెట్ ధరించాలి



పెదనందిపాడు: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ సూచించారు. సోమవారం మధ్యాహ్నం పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కళాశాలలో విద్యార్థులతో కలిసి బైక్‌లపై హెల్మెట్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెల్మెట్ వినియోగం వల్ల ప్రయోజనాలను వివరించారు. హెల్మెట్ ధరించండి సురక్షితంగా ప్రయాణించండి అంటూ పోలీసులు, విద్యార్థులు నినదించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి లావు ఆదిశేషయ్య, ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య, పీడీ శ్రీనివాస్, విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ పనితీరుపై అధ్యయనం



పెదకాకాని: సచివాలయ పనితీరుపై ట్రైనీ కలెక్టర్లు అధ్యయనం చేశారు. పెదకాకాని సచివాలయం-5కు సోమవారం శిక్షణలో ఉన్న 20 మంది కలెక్టర్లు విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయాల అడిషనల్ కమిషనర్ తోట కైలాష్ గిరీశ్వర్ మాట్లాడుతూ శిక్షణలో భాగంగా ఇక్కడకు వచ్చినట్టు వెల్లడించారు. ఉద్యోగుల విధులు, సచివాలయాల పనితీరు గురించి ట్రైనీ కలెక్టర్లకు అవగాహన కల్పించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.వి.మల్లేశ్వరరావు, సీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ రాజా రామ్మోహన్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్లు పాల్గొన్నారు.

డీ ఫార్మసీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో డీ ఫార్మసీ డిప్లొమా కౌన్సెలింగ్‌లో భర్తీ చేయగా మిగిలిన సీట్లకు ఫిబ్రవరి రెండో తేదీన స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకర్ రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫొటోస్టాట్ కాపీలతో రూ.6,300 ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చునని సూచించారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు పొందే విద్యార్థినులు ఎటువంటి ఫీజు రాయితీ, స్కాలర్‌షిప్ ఉండవని పేర్కొన్నారు. దరఖాస్తులను మంగళవారం నుంచి కళాశాలలోని ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి పొందగలరని తెలిపారు.

ఈవీఎం గిడ్డంగి పరిశీలన

ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామ శివారు మార్కెట్ యార్డులోని ఈవీఎం గోడౌన్‌ను ఆర్డీఓ ప్రభాకరరెడ్డి సోమవారం పరిశీలించారు. సాధారణ తనిఖీలలో భాగంగా గోడౌన్ బయట ఉన్న తాళాల పటిష్టతను, విద్యుత్ సరఫరా వ్యవస్థను, సీసీ కెమెరాల పనితీరును ఆయన పరిశీలించారు. భద్రత కల్పిస్తున్న పోలీసు సిబ్బంది రిజిస్టర్‌ను తనిఖీచేశారు. ఆయన వెంట తహసీల్దార్ పద్మనాభుడు, సిబ్బది పాల్గొన్నారు.

మద్యం మత్తులో గుంతలో పడి వ్యక్తి మృతి

మేడికొండూరు: మద్యం మత్తులో గుంతలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఫిరంగిపురం మండలం అమినాబాద్ గ్రామానికి చెందిన షేక్ నజీర్ (60) ఉపాధి కోసం పేరేచర్లలో టైలరింగ్ పని చేసేందుకు వస్తుంటాడు. ఆదివారం సాయంత్రం మద్యం సేవించి పేరేచర్ల జంక్షన్ నుంచి గ్రామానికి వెళ్లే కాలువ కట్టవద్ద దిమ్మెపై కూర్చొని మద్యం సేవించి అదుపు తప్పి పక్కనే ఉన్న గుంతలో పడ్డాడు. రాత్రి సమయం కావడంతో అతన్ని ఎవరూ గమనించలేదు. సోమవారం కాలువ కట్టపై వెళ్తున్న కొందరు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

లోకేష్ పిచ్చి పులకేశి

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఎద్దేవా

చేబ్రోలు: అవగాహన లేకుండా మాట్లాడుతున్న టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కుమారుడు లోకేష్ ఒక పిచ్చి పులకేశి అని పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య ఎద్దేవా చేశారు. పొన్నూరు పట్టణంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయని, ఆ మాత్రం అవగాహన కూడా లేని నారా లోకేష్ వాటి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి వారు పాదయాత్రలు చేసి ఎవరిని ఉద్ధరిద్దామనో అర్థం కావటం లేదన్నారు. ప్రజలను మభ్య పెట్టి మోసం చేసే పనులను టీడీపీ నేతలు చేస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, టీడీపీ వ్యవహారశైలి నచ్చక వల్లభనేని వంశీ, కరణం బలరాం, మద్దాలి గిరి తదితరులు వైఎస్సార్ సీపీకి మద్దతు పలుకుతున్నారన్నారు. చంద్రబాబు, లోకేష్ ఎన్ని కుయుక్తులు పన్నినా, కుప్పిగంతులు వేసినా, యాత్రలు చేసినా, పొర్లుదండాలు పెట్టినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ప్రజలను నిరంతరం మోసం చేసే పార్టీ తెలుగుదేశం పార్టీ అని విమర్శించారు.

షూటింగ్ బాల్ పోటీలలో ద్వితీయస్థానం

జాతీయ స్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

మాచవరం(చేబ్రోలు): రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పొన్నూరు మండలం మాచవరం హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ కరీముల్లా సోమవారం తెలిపారు. బాపట్ల జిల్లా చీరాలలో ఆంధ్రప్రదేశ్ సబ్‌జూనియర్ బాలికల విభాగంలో జనవరి 29న రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో గుంటూరు జిల్లా జట్టులో మాచవరం పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు పాల్గొన్నారని, గుంటూరు – అనకాపల్లి జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోటీలో స్వల్ప తేడాతో జిల్లా జట్టు ఓటమి పాలై ద్వితీయ స్థానంలో నిలిచిందని వివరించారు. ఈ పోటీలలో విశేష ప్రతిభ కనబరిచిన గుంటూరు జిల్లా జట్టులోని మాచవరానికి చెందిన ఇద్దరు విద్యార్థులు దీప్తి వెంకట లక్ష్మి, దుర్గా స్రవంతిలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం సుమతి, విద్యాకమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీలలో గుంటూరు జిల్లా జట్టులో పాల్గొన్న విద్యార్థులు పల్లవి, దీప్తి, వెంకటలక్ష్మి, స్రవంతి, పల్లవి, అమూల్య, సౌజన్య తరిష్మా, లావణ్య, సాత్వికలు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం లభించటంతో మెమెంటో, సర్టిఫికెట్‌లను అందుకున్నారని వెల్లడించారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు

విద్యార్థినులకు మానసిక దృఢత్వం అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థినులు మానసికంగా దృఢంగా ఉండాలని యువజన సర్వీసుల శాఖ, స్టెప్, స్వశక్తి సీఈవో ఎస్. పల్లవి సూచించారు. బ్రాడీపేటలోని బీహెచ్ బాలికోన్నత పాఠశాలలో స్టెప్ ఆధ్వర్యంలో వీఆర్ విత్ యూ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 9,10 తరగతుల విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాస, కెరీర్ గైడెన్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పల్లవి మాట్లాడుతూ విద్యార్థినులు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉత్సాహం, దృఢత్వాన్ని కలిగి ఉండాలని సూచించారు. వీఆర్ విత్ యూఆర్ ట్రస్ట్ చైర్మన్ ఎస్. అయ్యప్ప మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలు, నాయకత్వ లక్షణాలతో పాటు టెన్త్ తరువాత కోర్సుల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు కె. శాంతిభూషణ్, ప్రధానోపాధ్యాయురాలు పీఎల్ సుజాత, జరీనా, స్టెప్ మేనేజర్ బి. రాధిక, యుజవన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ సీహెచ్. శ్రీనివాసరావు, కేఎస్ఎస్సార్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థినికి వ్యక్తిత్వ వికాస పుస్తకాన్ని అందజేస్తున్న స్టెప్ సీఈఓ పల్లవి

సంక్షిప్త వార్తలు

మత్తులో బాత్‌రూంలోకి ప్రవేశించిన ఆగంతకుడు

గుంటూరు ఈస్ట్: శానిటైజర్ మత్తులో ఓ ఇంట్లోని బాత్‌రూంలోకి దూరి స్నానం చేసిన ఆగంతకుడిని ఇంటి యజమానులు, స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సేకరించిన సమాచారం మేరకు.. సంగడిగుంటలోని ఓ ఇంట్లోకి శానిటైజర్ తాగి న మత్తులో ఓ వ్యక్తి సోమవారం ప్రవేశించి బయట ఉన్న బాత్‌రూంలోకి వెళ్లి స్నానం చేశాడు. గమనించిన ఇంటి యజమాని, స్థానికులు అతడ్ని పట్టుకుని లాలాపేట పోలీసులకు అప్పగించారు. తారకరామ నగర్‌కు చెందిన ఆవుల ఆనంద్‌గా గుర్తించారు. కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు.

దంపతులపై దాడి

రోడ్డు దాటుతున్న దంపతులపై ఐదుగురు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణబాబు కాలనీకి చెందిన అనూష, ఆమె భర్త సోమవారం స్వామి థియేటర్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనాలపై వచ్చిన కొందరు వ్యక్తులు వారిని ఢీకొనబోయారు. ఈ నేపథ్యంలో అనూష, ఆమె భర్తకు, ఐదుగురి వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. దంపతులపై వారు దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. నేతాజీనగర్‌కు చెందిన మస్తాన్‌వలి గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 400 గ్రాములున్న 40 గంజాయి లిక్విడ్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నెల్లూరి కృష్ణప్రసాద్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కొత్త పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేట చెందిన నెల్లూరి కృష్ణ ప్రసాద్ (49) అనే వ్యక్తి ఈనెల 29న చికిత్స నిమిత్తం చేరి సోమ వారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831320కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రెండువర్గాల మధ్య ఘర్షణ

గుంటూరు రూరల్: నగర శివారు గోరంట్లలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కొందరు రెండు వర్గాలుగా ఏర్పడి సోమవారం గొడవకు దిగారు. అటుగా వెళుతున్న పెట్రోలింగ్ సిబ్బంది రెండువర్గాలనూ అదుపులోకి తీసుకున్నారు. నల్లపాడు ఎస్సై జత్యానాయక్ కథనం ప్రకారం గోరంట్ల వేంకటేశ్వరస్వామి గుడి వద్ద రెండు వర్గాలు ఘర్షణకు దిగాయి. ఆలయ కమిటీ విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో గొడవ జరిగినట్టు సమాచారం. దీంతో పెట్రోలింగ్ సిబ్బంది ఇరువర్గాలనూ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జత్యానాయక్ తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెహ్రూనగర్(గుంటూరు) : నగరంలోని 29, 30 డివిజన్లకు చెందిన శ్మశానవాటికలో రూ. రూ. 35లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం కార్పొరేటర్లు షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి శంకుస్థాపన చేశారు. త్వరలోనే వాటికను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

శాంతిదూత జాతిపిత గాంధీ

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరురూరల్/కాకుమాను/పెదనందిపాడు: అహింసే ఆయుధంగా తెల్లదొరలపై పోరాడిన ధీశాలి, శాంతిదూత మహాత్మా గాంధీ అని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత చెప్పారు. గుంటూరులోని తన కార్యాలయంలో సోమవారం గాంధీజీ వర్ధంతిని నిర్వహించారు. మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుచరిత మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీ పాత్ర అనిర్వచనీయమన్నారు. ఉప్పుసత్యాగ్రహం వంటి పోరాటాలతో బ్రిటిష్ పాలకులకు కంటిమీద కునుకులేకుండా చేసిన గొప్ప వ్యక్తి బాపూజీ అన్నారు. నేటి తరం యువత ఆయన గురించి తెలుసుకోవలసిన అవసరం ఉందన్నారు. ఆయన ఆలోచనలు అందరికీ ఆదర్శప్రాయమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, షేక్ జిలాని, పిల్లి మేరి, ఏరువ సాంబిరెడ్డి, స్మితాపద్మజ, సూర్యప్రకాష్, బి శ్రీనివాసరావు, ఎన్ శ్రీనివాసరావు, ఏటుకూరి విజయసారథి, లక్ష్మి, కె జ్యోతి, ముత్యాల రాజు, దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

- కాకుమాను తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గాంధీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి తహసీల్దార్ జె.ప్రసాదరావు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోనూ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ నాగానంద్, సిబ్బంది పాల్గొన్నారు.
- పెదనందిపాడు తహసీల్దార్ కార్యాలయంలోనూ గాంధీ చిత్రపటానికి తహసీల్దార్ సుభాని పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.సాయిలీల, ఏఓ సుధారాణి పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుచరిత



కాకుమానులో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు

నేడు గుంటూరులో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ

ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ నిపుణుడు నిక్ వుజిసిక్ రాక

గుంటూరు ఎడ్యుకేషన్: అమెరికాకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణుడు నిక్ వుజిసిక్ మంగళవారం గుంటూరు నగరానికి రానున్నారు. పుట్టుకతోనే అరుదైన వ్యాధికి గురై చేతులు, కాళ్లు లేకుండా జన్మించిన నిక్ వుజిసిక్ తనలోని లోపాన్ని లోపంగా భావించక ఆత్మస్థైర్యంతో ఎదిగి, లక్షలాది మందిలో ధైర్యాన్ని నింపే స్థాయికి చేరుకున్నారు. గుంటూరుకు చెందిన ఎస్ఆర్ గ్రూప్స్ డైరెక్టర్ బొర్రా నరేష్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని బీఆర్ స్టేడియంలో మంగళవారం సాయంత్రం 4.00 గంటల నుంచి 9,10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, బీటెక్, పీజీ చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు హాజరు కానున్నారు.



కుష్ఠు వ్యాధి నిర్మూలనే లక్ష్యం

జిల్లా లెప్రసీ ఆఫీసర్ లక్ష్మానాయక్

గుంటూరు మెడికల్: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక శ్రీనివాసరావుతోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'యాంటీ లెప్రసీ డే' వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ భూక్యా లక్ష్మానాయక్ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. జాతిపిత మహాత్మా గాంధీ రోగులకు చేసిన సేవల గురించి వివరించారు. ఆయన సేవా దృక్పథాన్ని అలవర్చుకుని రోగుల్ని ఆదరించాలని చెప్పారు. కుష్ఠు వ్యాధిని సమాజం నుంచి తరిమి వేయడానికి క్షేత్రస్థాయి సిబ్బంది సకాలంలో రోగుల్ని గుర్తించి వెంటనే చికిత్స అందించడం ద్వారా అంగవైకల్యం, ఇతర సమస్యలు రాకుండా నిరోధించవచ్చని సూచించారు. వ్యాధి నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి జయప్రసాద్, హెచ్ఈఓ కృష్ణారెడ్డి, డాక్టర్ ఎం.సోమ్లానాయక్, జె.మురళీకృష్ణ, సాంబశివరావు, పలువురు ఆశాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మానాయక్

నాట్కో ట్రస్టు సేవలు భేష్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో రోగులకు సేవలు బాగున్నాయని జింఖానా బోర్డ్ ఆఫ్ ట్రస్టీ డాక్టర్ యలవర్తి రామరాజు భూషణుడు, రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ సులోచన దంపతులు ప్రశంసించారు. సోమవారం నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను వారు సందర్శించారు.రోగులకు అందుతున్న సేవలు, ఆసుపత్రిలో అధునాతన వైద్య పరికరాల్ని పరిశీలించారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌లను గుర్తించే వ్యాధి నిర్ధారణ పరికరాలతో పాటు శస్త్ర చికిత్సలకు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌ను సైతం నాట్కో ట్రస్టు ఏర్పాటు చేయడం శుభ పరిణామమని పేర్కొన్నారు. రేడియోథెరపీ విభాగాధిపతి డాక్టర్ జి.దుర్గాప్రసాద్, మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.వి.శివరామకృష్ణ, నాట్కో క్యాన్సర్ సెంటర్ సమన్వయకర్త యడ్లపాటి అశోక్ కుమార్, డాక్టర్ శ్రీనివాసులు సెంటర్‌లో అందిస్తున్న వైద్య సేవల గురించి వారికి వివరించారు.

కన్నుల పండువగా శ్రీ సీతారాముల కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేట రెండో లైనులోని శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత ఓంకార క్షేత్రంలో శ్రీ సీతారామాంజనేయ నగర సంకీర్తన సంఘం కార్యదర్శి నంబూరి వెంకట నారాయణమూర్తి పర్యవేక్షణలో 89వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు, 93వ సంఘ వార్షికోత్సవాలు విశేషంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీ గంగా భువనేశ్వరి సమేత ఓంకారేశ్వరస్వామికి అభిషేకార్చనలు, సీతా సమేత కోదండ రామస్వామికి తులసి అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు బుజ్జి బృందం ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. దంపతుల ముత్యాల తలంబ్రాలు, మహా హారతి , మంత్ర పుష్పం, అర్చకుల ఆశీర్వాదం అనంతరం విశేషంగా పాల్గొన్న భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. ఇందుమతి బృందం భక్తి సంగీతం ఆకట్టుకుంది. శ్రీ మద్రామాయణ ప్రవచనంలో భాగంగా శ్రీ ఆంజనేయస్వామికి శ్రీ రాముని దర్శనం, సుగ్రీవునితో మైత్రి, వాలిని సంహరించడం, సీతాన్వేషణ, కిష్కింధలోని అనేక సన్నివేశాల్ని మంచికంటి వెంకట సత్యవతి వివరించారు.

శివాలయంలో నేడు షాపుల వేలం

పెదకాకాని: శివాలయంలో షాపుల నిర్వహణకు టెండర్ కమ్ బహిరంగ వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన షాపుల నిర్వహణ లైసెన్స్ హక్కులకు ఈ ప్రొక్యూర్‌మెంట్, టెండర్ కమ్ బహిరంగ వేలంపాటలు దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు ఆలయ అధికారులను సంప్రదించి పాటదారుడి పేరు నమోదు చేయించుకుని వేలంపాటలో పాల్గొనవచ్చని ఏసీ సూచించారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

పెదకాకాని: ఇంటి పన్ను వసూళ్ళు వేగవంతం చేయాలని జిల్లా పంచాయితీ అధికారి కేశవరెడ్డి చెప్పారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా డీపీఓ ఎస్.కేశవరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో ఇంటి పన్ను వసూళ్లు త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ లక్ష్మణరావు, ఈఓపీఆర్డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

9 మంది జూదరుల అరెస్ట్

పెదనందిపాడు: రెండు గ్రామాల్లో పేకాట అడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం మండల పరిధిలోని అబ్బినేనిగుంటపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,050 నగదు, గోగులమూడి గ్రామంలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,100 నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్టయితే స్థానిక పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

యువతి అదృశ్యం

గుంటూరు రూరల్: యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. నల్లపాడు సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం గోరంట్ల గ్రామ శివారులో ఓ అపార్టుమెంట్‌లో నివాసం ఉండే చాట్ల సుగుణమ్మ 16 సంవత్సరాల కుమార్తె స్థానికంగా ఓ కిరాణా షాపులో పనిచేస్తుంటుంది. ఈనెల 29న ఇంట్లో నుంచి షాపుకని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, చుట్టుపక్కల వారిని, బంధువులను అడిగినా ఆచూకీ తెలియక పోవడంతో తల్లి సుగుణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం



అనసూయమ్మ

గుంటూరురూరల్: వివాహిత అదృశ్యమైన ఘటనపై నల్లపాడు పోలిస్‌స్టేషనులో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం .. గుంటూరురూరల్ మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఓసా వెంకటేశ్వర్లు పాతసామానులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈ నెల 28న ఉదయం తొమ్మిది గంటలకు వెంకటేశ్వర్లు పని నిమిత్తం షాపునకు వెళ్లి రాత్రి పది గంటలకు తిరిగి ఇంటికి వెళ్లాడు. ఇతని భార్య ఓసా అనసూయమ్మ (33) ఇంట్లో కనిపించకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికాడు. అయినా ఆచూకీ లభించకపోవడంతో నల్లపాడు పోలిస్‌స్టేషనులో పిర్యాదు చేశాడు. ఈ మేరకు భర్త వెంకటేశ్వర్లు ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు స్టేషన్ ఎస్ఐ జేత్యానాయక్ 8688831590 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

